క్లుప్తంగా

నేరాల అదుపులో సీసీ కెమెరాలు కీలకం



డోర్నకల్: నేరాలను అదుపులో ఉంచడానికి సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపారు. మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో ఏర్పాటు చేసిన 11 సీసీ కెమెరాలను బుధవారం సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలోనూ సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానికులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై వంశీధర్, హెడ్ కానిస్టేబుల్ సైదులు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, నాయకులు తాళ్లూరి హనుమంతరావు, రామయ్య, రామారావు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయడం అభినందనీయం



మరిపెడ రూరల్: పేద ప్రజలు కంటి పరీక్షలు చేయడం అభినందనీయమని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ గుగులోతు రవి అన్నారు. బుధవారం మరిపెడ మండలం తానంచర్ల గ్రామంలోని ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆస్పత్రి సహకారంతో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మెడికల్ ఆఫీసర్ రవి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల జాన్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ గద్దల రామ్మూర్తి, జిల్లా కోర్డినేటర్ ఐనాల పరశురాములు, శంకర్ అమర్నాథ్ పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన కమిషనర్ ఫోన్ ఇన్ కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారంపై తాగునీరు, శానిటేషన్, విద్యుత్ సిబ్బందితో కమిషనర్ ఉదయ్‌కుమార్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఏఈ పి.శృతి, హెల్త్ అసిస్టెంట్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఆమనగల్ 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత సరఫరా నిలిపివేస్తారని విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ వెంకటేష్ బుధవారం తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆమనగల్ సబ్‌స్టేషన్ పరిధిలోగల అమంగల్, బలరాంతండా, బోరింగ్ తండా, భజన తండా, ధరావత్ తండా, గుండాలగడ్డ తండా, వావిలాల గ్రామాల పరిధిలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఎస్పీని కలిసిన హెడ్‌కానిస్టేబుల్



మహబూబాబాద్ రూరల్: ఎస్పీ డ్రైవరుగా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మద్దిని రమేష్ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందాడు. బుధవారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను మర్యాద పూర్వకంగా కలిశాడు.

'చెత్త' కాల్వ!



ఎస్సారెస్పీ కాల్వ సమీపంలో జలమయమైన ప్రాంతం

● పేరుకుపోయిన చెత్తతో వృథాగా పోతున్న ఎస్సారెస్పీ జలాలు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెళ్లే దారిలో ఉన్న ఎస్సారెస్పీ కాల్వ చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో ఆఫీస్‌కు వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు నుంచి నీరు వృథాగా పోతున్నాయి. ఆ ప్రాంతంలోని ఇళ్ల చుట్టు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మెడికల్ కాలేజీకి వెళ్లే దారిలో ఎస్సారెస్పీ కాల్వను కుదించడం వలన కూడా సమస్య తలెత్తింది. పలు ప్రాంతాలలో నీరు లేక పంటలు ఎండిపోతుంటే ఇక్కడ జలాలు వృథాగా పోతున్నా.. నీటిపారుదల శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు, రైతులు కోరుతున్నారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే దారిలో కాల్వలో చెత్తాచెదారం



కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో వృథాగా పోతున్న నీరు

తూకంలో తేడా వస్తే చర్యలు



కాంటాలను పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

పెద్దవంగర/నర్సింహులపేట: ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, తూకంలో తేడా వస్తే సహించబోమని తూనికలు, కొలతలు శాఖ జిల్లా అధికారి విజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు గ్రామాలకు చెందిన రేషన్ డీలర్ల వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాంటాలను పరిశీలించారు. అనంతరం తూనికలు, కొలతలు శాఖ నుంచి టెక్నీషియన్ క్రాంతి కుమార్‌తో ప్రామాణిక ముద్రలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యాపారులు వినియోగించుకొనే తూనికలు, కొలతల యంత్రాలపై తప్పనిసరిగా ముద్రలు వేయించుకోవాలని తెలిపారు. సీలు లేని కాంటాలు వినియోగిస్తే తగు చర్యలు ఉంటాయన్నారు. రేషన్ డీలర్లు తూకాల్లో మోసాలకు పాల్పడవద్దని, లబ్ధిదారులతో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు పాడిశెట్టి రమేశ్, ముత్యం ఆంజనేయులు, వెంకన్న, రమేశ్, నారాయణ పాల్గొన్నారు.

పనిముట్లకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్/గూడూరు/నెల్లికుదురు/మరిపెడ రూరల్/పెద్దవంగర: వ్యవసాయ పనిముట్లకుగాను మహిళా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి బుధవారం తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మేకనైజేషన్ (స్మాన్) 2024- 25 పథకం ద్వారా వివిధ వ్యవసాయ పనిముట్లు అందజేయనున్నట్లు, గురువారం సాయంత్రంలోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మహిళా రైతులు వారి పేరు మీద భూమి పట్టాదారు పాస్ బుక్కు కలిగి ఉండాలన్నారు. ట్రాక్టర్ పనిముట్ల కోసం ట్రాక్టర్ ఆర్సీ, ఆధార్ కార్డు జిరాక్స్ జతచేసి వ్యవసాయ యాంత్రీకరణ దరఖాస్తు ఫారం నింపి మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. మహిళా రైతుల్లో సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యం ఉంటుందని, 50 శాతం సబ్సిడీపై పనిముట్లు 5పవర్ స్ప్రేయర్లు (జనరల్ కేటగిరి-4, ఎస్సీ కేటగిరి-1), బ్యాటరీ స్ప్రేయర్లు 5 (జనరల్-4, ఎస్సీ-1), రోటివేటర్లు 4 (జనరల్ -2, ఎస్సీ-1, ఎస్టీ-1), కల్టివేటర్లు/ఎంబీ ప్లవ్/డిస్క్ హారో 3 (జనరల్), బండు ఫార్మర్ 2 (జనరల్-1, ఎస్టీ-1), గడ్డి కట్టలు చుట్టే యంత్రం 1(ఎస్టీ)కి కేటాయించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, మొత్తం సబ్సిడీ విలువ రూ.4,23,635గా నిర్ణయించారని పేర్కొన్నారు.

పాస్టర్ మృతిపై విచారణ జరిపించాలి

నెహ్రూసెంటర్/కేసముద్రం: హైదరాబాద్‌లో క్రైస్తవ బోధకుడిగా ఉంటున్న పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై విచారణ చేపట్టాలని క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో పాస్టర్లు, క్రైస్తవ నాయకులు జిల్లా కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పాస్టర్ ప్రవీణ్ విజయవాడ, రాజమండ్రి మార్గ మధ్యలో అనుమానాస్పదంగా చనిపోయి ఉండడం ఆవేదన కలిగించిదన్నారు. పాస్టర్ మృతిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీబీఐ విచారణ జరిపించి దోషులను శిక్షించాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవ నాయకులు మల్లెపాక తిమోతి, ప్రేమానందం, కుమారస్వామి, వెంకట్‌రెడ్డి, సునీత, ఇజ్రాయేల్, ప్రభు, కరుణాకర్, మహేందర్, శ్రీనివాస్, శ్రావన్ పాల్గొన్నారు.

అందాల పోటీలను రద్దు చేయాలి

● పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు కృష్ణవేణి



మహబూబాబాద్: మాట్లాడుతున్న కృష్ణవేణి

మహబూబాబాద్/గార్ల: హైదరాబాద్‌లో నిర్వహించే అందాల పోటీలను రద్దు చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు గుజ్జు కృష్ణవేణి డిమాండ్ చేశారు. పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 72వ ప్రపంచ అందాల పోటీలను రద్దు చేయాలని, సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా గృహలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఇవ్వాలన్నారు. దేశంలో రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని అరికట్టకుండా అందాల పోటీలను నిర్వహించడం సిగ్గు చేటన్నారు. పోటీలను రద్దు చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. గార్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట అందాల పోటీలను రద్దు చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊకే పద్మ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కల్పన, జ్యోతి, పద్మ, స్వప్న, మౌనిక పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటవస్తువుల పంపిణీ

కేసముద్రం: మున్సిపాలిటీ కేంద్రంలో చిరువ్యాపారులకు ఎండతగలకుండా జిల్లా క్యాబినెట్ కోఆర్డినేటర్ రేవూరి రమణారెడ్డి సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పెద్దగొడుగులను అందజేశారు. అదే విధంగా తాళ్లపూసపల్లి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు క్రికెట్ కిట్, క్యారం బోర్డు, వాలీబాల్, చెస్, షటిల్ బ్మాడ్మింటన్, స్కిప్పింగ్ తాళ్లు, పరీక్ష ప్యాడ్‌లు, డిక్షనరీలను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మామిడి అశోక్, సెక్రటరీ రావుల నవీన్‌రెడ్డి, ట్రెజరర్ లక్కాకుల సత్యనారాయణ, చిర్ర యాకాంతంగౌడ్, చంద్రోఖర్‌రావు, యర్నం శ్రీరాములు, మారం సమ్మిరెడ్డి, చింత కరుణాకర్, మడిపెద్ది వెంకటేశ్ పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న ఒగ్గు కళాకారులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామంలో కొలువై ఉన్న బంగారు మైసమ్మ తల్లి ఆలయం వద్ద అమ్మవారి కల్యాణోత్సవం బుధవారం కనులపండువగా నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, బిందురెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో భాగంగా ఒగ్గు కళాకారులు, పూజారులు ప్రత్యేక పూజలు జరిపి, బంగారు మైసమ్మ తల్లి కల్యాణానికి ప్రతిరూపంగా త్రిశూలం, కత్తి ఏర్పాటు చేసి కల్యాణోత్సవ క్రతువు పూర్తిచేశారు. కార్యక్రమంలో పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, భువనగిరి గంగాధర్ నాథ్, బొడ్డుపల్లి ఉపేంద్రం, నూకల వెంకటయ్య, కడిగె ముసలయ్య, కుడుముల సురేందర్ రెడ్డి, బొంగు మల్లయ్య, సత్తిరెడ్డి, దేశెట్టి మల్లయ్య పాల్గొన్నారు. సాయంత్రం బోనాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

వీఓలకు రూ.20వేల వేతనం ఇవ్వాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: ఐకేపీ వీఓలకు రూ.20వేల వేతనం ఇవ్వాలని, వీఓల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అన్నారు. వీఓల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఓఏల సమస్యలపై బడ్జెట్ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో తీర్మానం చేసి జీఓలను ప్రకటించాలన్నారు. సమస్యలపై పోరాటానికి హైదరాబాద్‌కు వెళ్తున్న వీఓలను అర్ధరాత్రి అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వీఓలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న, మచ్చ వెంకన్న, రజాక్, చింత మౌనిక, సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి



జగదీష్

గార్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో తెలంగాణ ఉద్యమకారులకు మొదట ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఇల్లెందు నియోజకవర్గ కన్వీనర్ కొమ్రరాజు జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గార్లలో ఆయన విలేకరుతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ముందుండి కొట్లాడిన ఉద్యమకారులు లాఠీలకు, తూటాలకు భయపడకుండా ఉద్యమించి జైలు, కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడ్డామని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ పథకంలో ఉద్యమకారులకు 90శాతం రాయితీ కల్పించి కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు సతీష్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దివ్యాంగులకు లబ్ధి కల్పించాలి

గూడూరు: ప్రభుత్వం అన్ని వర్గాల యువత చేయూతకు ప్రవేశపెట్టిన రాజీవ్ యువజన వికాసం పథకంలో దివ్యాంగులకు లబ్ధి కల్పించాలని వీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి రుద్ర తిరుపతి కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీరాములు, లక్ష్మణ్, ఉమేష్, సంపత్, ముక్తీశ్వర్ పాల్గొన్నారు.

పన్నుభారం తగ్గించాలి

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీలో ఇంటిపన్ను భారం తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అలువాల వీరయ్య అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడ లేనివిధంగా మరిపెడ మున్సిపాలిటీలో పన్ను అధికంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్, నాయకులు రాజన్న, రమేష్ పాల్గొన్నారు.

శ్రీవారి కల్యాణోత్సవం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీరామ ఆలయంలో జరుగుతున్న శ్రీవెంకటేశ్వర స్వామివారి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీఅలివేలుమంగా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



గూడూరు: మండలంలోని దుబ్బగూడెం గ్రామంలో బుధవారం జాతీయ ఉపాధిహామీ పథకం రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ సరితాబాలాజీనాయక్ ప్రారంభించారు.

కురవిలో..

కురవి: మండల కేంద్రంలోని జర్నలిస్టుల డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలో ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ సహకారంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌కుమార్, మోహన్‌రావు, వీరభద్రం, నాగరాజు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

మహబూబాబాద్ రూరల్: మండలంలోని నడివాడ గ్రామానికి చెందిన భూక్య బాలాజీ గత ఏడాది నవంబర్ మాసంలో సెల్ పోగొట్టుకోగా ఆచూకీ కనుగొని బాధితుడికి అప్పగించామని రూరల్ ఎస్సై వి.దీపిక బుధవారం తెలిపారు.

ఆశాకార్యకర్తల నిరసన

కేసముద్రం: చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న ఆశాలను అక్రమంగా అరెస్టు చేశారంటూ ఇనుగుర్తి మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు బుధవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి జల్లె జయరాజ్, బూర లక్ష్మీ, రమ, శ్రీలత, అరుణ, లలిత, రాధ, సుజాత, మహేశ్వరి పాల్గొన్నారు.

బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడిగా నరేష్



మహబూబాబాద్ అర్బన్: బహుజన సమాజ్‌వాది పార్టీ మహబూబాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడిగా మహబూబాబాద్ మండలం జంగిలిగొండ కొత్తూరు హాజరియా తండాకు చెందిన గుగులోత్ నరేష్‌ను ఏకగ్రీవంగా నియమించినట్లు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఈసంపెల్లి ఉపేందర్ బుధవారం తెలిపారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

మహబూబాబాద్ రూరల్: మండలంలోని సోమ్లతండాలో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్రసాద్, సర్వేయర్ లక్ష్మణ్ బుధవారం స్థల పరిశీలన చేశారు.

హాస్టల్ తనిఖీ

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను మండల ప్రత్యేక అధికారి కృష్ణవేణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు పిల్లలకు వడ్డించే భోజనాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హరిప్రసాద్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

తొర్రూరు: తొర్రూరు బార్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం డివిజన్ కేంద్రంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా అలిసేని ముకుందరావు, ప్రధాన కార్యదర్శిగా మైలపాక అశోక్, ఉపాధ్యక్షుడిగా ఆర్కే ఘనపురం, సంయుక్త కార్యదర్శిగా మిడతపల్లి ఎల్లేష్, కోశాధికారిగా నాగరాజు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా పల్లవిలు ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా వెంకటేశ్వర్లు, జిల్లా భాస్కర్, విజయ నియమితులయ్యారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: ఇల్లు, ఇంటి స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో భూపోరాట కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.

డీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

పెద్దవంగర: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల కమిటీని మండల కేంద్రంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాస్ సమక్షంలో చేపట్టారు. మండల అధ్యక్షుడిగా గాడిపల్లి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా దేవదాస్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నిఖిల్, కార్యదర్శిగా భాస్కర్, కన్వీనర్‌గా హరికృష్ణ నియమితులయ్యారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

దంతాలపల్లి: రెండు బైకులు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం తూర్పుగూడెం గ్రామానికి చెందిన శ్రీకాంత్, మండలంలోని నిదానపురంలోని బంధువుల ఇంటికి వచ్చి వెళ్తున్నాడు. ఈక్రమంలోనే మండలంలోని రామానుజపురం గ్రామానికి చెందిన గిరగాని వెంకన్న వేములపల్లి శివారు తన వ్యవసాయ క్షేత్రం వద్ద నుంచి వస్తున్నాడు. ఈక్రమంలో రెండు బైకులు ఎదురుగా ఢీకొనడంతో శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు కాగా, వెంకన్నకు స్వల్ప గాయాలయ్యాయి, ఇరువురిని ఆస్పత్రికి తరలించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కేసముద్రం: మున్సిపాలిటీ కేంద్రంలోని ఓ మిల్లులో మక్కలను(మొక్కజొన్నలు) అమ్మేందుకు వచ్చిన భూక్యారాం తండాకు చెందిన భూక్య బీకోజీ భద్రమ్మ అతని బంధువుపై మిల్లు యజమాని ఆగె వెంకన్న, అతని కుమారుడు నాగరాజులు కులంపేరుతో దూషించి దాడి చేశారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు బుధవారం ఎస్సై మురళీధర్ రాజు తెలిపారు. అదేవిధంగా మిల్లులో అక్రమంగా ప్రవేశించి మొక్కజొన్నలను వద్దు అని చెప్పినా ఆరబోసుకున్నారని, పైగా మొక్కజొన్నలను దొంగతనం చేసి, దౌర్జన్యానికి దిగారని మిల్లు యజమాని ఆగె వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీకోజీ, భద్రమ్మతోపాటు బంధువుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్..

బైండోవర్ ఉల్లంఘన.. ఇద్దరు జైలుకు

తొర్రూరు/ నెల్లికుదురు: గుడుంబా రవాణా, తయారీ కేసులో పట్టుబడి బైండోవర్ ఉల్లంఘించిన ఇద్దరిని ఎక్సైజ్ అధికారులు జైలుకు తరలించారు. ఎక్సైజ్ ఏఈఎస్, తొర్రూరు ఇన్‌చార్జ్ సీఐ రాజేశుని ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన గుంటుక యాకయ్య, నెల్లికుదురు మండలం రాజుల కొత్తపల్లికి చెందిన పెరుమాండ్ల సత్తెమ్మలు గతంలో గుడుంబా విక్రయిస్తూ పట్టుబడగా వారిని ఎక్సైజ్ అధికారులు ఆయా మండలాల తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ ఉల్లఘించి అదే తరహాలో సారా విక్రయాలు జరుపుతుండడంతో బ్రీచ్ కేసులు నమోదు చేశారు. వారిని ఖమ్మం జైలుకు తరలించారు.

భూవివాద ఘటనలో 12 మందిపై కేసు నమోదు

తొర్రూరు: మండలంలోని జీకే తండాలో భూవివాదంలో దాడి చేసుకున్న ఘటనలో 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని జీకే తండాకు చెందిన గుగులోతు రమేష్, బిచ్యాకు మధ్య కొంత కాలంగా వ్యవసాయ భూమి బాట విషయంలో తగాదాలు జరుగుతున్నాయి. కాగా తండాలో మంగళవారం జరిగిన ఎల్లమ్మ పండగలో రమేష్, బిచ్యా కుటుంబ సభ్యులు తగాదా పడి ఇరువర్గాలు కొట్టుకున్నారు. అనంతరం తొర్రూరులోని అన్నారం రోడ్డులో ఎదురుపడి ఇరువర్గాలు రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈఘటనలో ఇరు వర్గాలకు చెందిన 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తాగుతున్న వ్యక్తిపై..

బయ్యారం: మండల కేంద్రంలో గంజాయి సేవిస్తున్న వ్యక్తిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గార్ల-బయ్యారం సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలో ఓ వ్యక్తి గంజాయి సేవిస్తున్నాడనే సమాచారం మేరకు ఎస్సై తిరుపతి తన సిబ్బందితో వ్యక్తి ఇంటికి వెళ్లారు. వ్యక్తికి ఇంటిగ్రేటెడ్ ఈ-జడ్ యూరిన్ టెస్ట్ చేయగా గంజాయి సేవించినట్లు పాజిటివ్ వచ్చిందన్నారు. ఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

డోర్నకల్: మండలంలోని ఓ గిరిజన తండాలో బాలికను వేధింపులకు గురి చేసిన యువకుడిపై డోర్నకల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ బి.రాజేష్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గిరిజన తండాకు చెందిన యువకుడు అదే గ్రామానికి చెందిన బాలికపై పెళ్లి పేరుతో వేధింపులకు గురి చేయగా బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృతి

పెద్దవంగర: రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. ఈసంఘటన తొర్రూరు-వలిగొండ ప్రధాన రహదారిపై పెద్దవంగర మండలం చిన్నవంగర స్టేజీ వద్ద బుధవారం జరిగింది. వివరాలు.. మండలంలోని బావోజీతండాకు చెందిన బానోతు పంతులు (70) భార్యతో కలిసి మేకలు కాసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంట్లో వంట సరకులు లేకపోవడంతో చిన్నవంగర స్టేజీ వద్ద ఉన్న ఓ కిరాణం షాపుకు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు దాటుతున్న క్రమంలో తొర్రూరు నుంచి తిరుమలగిరి వైపు వెళ్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం అతన్ని ఢీకొట్టింది. వెంటనే స్థానికులు గమనించి 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఎంజీఎంలో మృతి చెందాడు. మృతుడికి భార్య బాజు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్సై క్రాంతి కిరణ్ వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఏపీఓను తక్షణమే బదిలీ చేయాలి

మరిపెడ రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మరిపెడ మండల ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న మంగమ్మను తక్షణమే అక్కడి నుంచి మరోచోటుకు బదిలీ చేయాలని సీపీఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం మహబూబాబాద్‌లో డీఆర్డీఓ మధుసూదనరాజ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. ఏపీఓ మంగమ్మ 13ఏళ్లుగా దీర్ఘకాలికంగా ఒకేచోట విధులు నిర్వహిస్తూ నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రజావేదిక



నెల్లికుదురు: సామాజిక తనిఖీ ప్రజావేదిక 15వ విడత మండల సభ బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలోబుధవారం జరిగింది. 2023-24 సంవత్సరానికి సంబంధించి మండలంలోని 36 గ్రామాలల్లో హారితహారం, చెరువు పూడికతీతలు, కాల్వ పూడిక పనులు, గుట్టల చుట్టు కందకాల పనుల కోసం ఎంఆర్ఎన్ఆర్ఈజీఎస్ నిధుల వివరాలు వెల్లడించారు. రూ.10,22,02,048కోట్లు, పంచాయతీరాజ్ నిధులు రూ.3,32,10,972 మొత్తం రూ.13,54,130,20కోట్ల నిధులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించినట్లు డీఆర్‌డీఓ మధుసూదనరాజు తెలిపారు. సంతకాలు లేకుండా, ఆధార్ అనుసంధానం, గ్రామసభల తీర్మానం, ఎంపీడీఓ, ఏపీఎం సంతకాలు లేకుండా చెల్లింపులు చేసిన 35గ్రామాల్లో మొత్తం జరిగిన అవినీతి రూ.1,52,910లక్షలు రికవరీకి ఆదేశాలు జారీ చేసినట్లు డీఆర్‌డీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలరాజు, ఎస్ఆర్‌పీ కొమురయ్య, డీపీసీ మన్‌మోహన్‌రెడ్డి, ఏపీఓ మాధవి పాల్గొన్నారు.